## కథ

-కె. వాసవదత్త

**''సుజా! ఏడవకు!'' అన్నాడు రవి!**

**''ఆ దేవుడు మనకింత అన్యాయం చేశాక, ఏడవకుండా ఎలా ఉండమంటారు?'' ఏడ్చి ఎర్రబడిన కళ్లతో భర్త వంక చూస్తూ అంది సుజాత, హాస్పిటల్‌లో బెడ్ మీద పడుకుని!**

# అమ్మ

''సుజా! అసలే నీ ఆరోగ్యం బాగోలేదు! ఇలా ఏడుస్తుంటే నీ ఆరోగ్యం ఇంకా దిగజారుతుంది. కొంచెం దుఃఖాన్ని దిగమింగుకోవాలి!''

''నావల్ల కావడం లేదండి!'' అంటూ అతని ఒళ్లో తల పెట్టుకుని హిస్టీరిక్‌గా ఏడ్చేసింది.

''సుజా! ఏం జరిగినా అంతా ఆ భగవంతుడి నిర్ణయమే. మన చేతుల్లో ఏముంది చెప్పు?'' గద్గదికంగా అన్నాడు.

''ఏవండీ, మనకిక పిల్లలు పుట్టరని తెలిశాక నాకింకా బతకాలనిపించడం లేదు.''

''సుజా! అలా మాట్లాడకు, ప్లీజ్ కంట్రోల్ చేసుకో! మనకి పిల్లలు పుట్టకపోతేనేం నాకు నువ్వు, నీకు నేను, మనమే ఒకళ్లకొకళ్లం తోడు సరేనా! అయినా నువ్వు ఇలా బాధపడుతూ, ఏడుస్తూంటే నేనేమైపోవాలి చెప్పు!''

అతని మాటలకి చివ్వున తలెత్తి చూసింది సుజాత.

అతని ముఖం అలసటగా పీక్కుపోయినట్టుగా ఉంది.

''ఎంతసేపు మీ గురించేమీ ఆలోచించకుండా నా బాధే చెప్పుకుంటూ మిమ్మల్ని చాలా కష్టపెడుతున్నాను కదూ!''

''అదేం లేదు. కానీ నువ్వు ధైర్యంగా ఉండు, నాకంతే చాలు!'' ఆమెను దగ్గరగా తీసుకుని తల మీద చేయివేసి జుట్టు నిమురుతూ అన్నాడతను.

సుజాత ఏడుపు ఆపుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తూ అతని మెడ చుట్టూ చేయి వేసి అలాగే కరుచుకుపోయింది!

సుజాతకి గర్భసంచి తీసేయడం, తనకిక పిల్లలు పుట్టరన్న వాస్తవం కళ్ల ముందు మెదలడంతో అతనికీ దుఃఖం వచ్చింది.

ఆ దుఃఖంలో ఎందుకో అతనికి తన తల్లి గుర్తుకు వచ్చింది.

★ ★ ★

రవిది తూర్పు గోదావరి జిల్లాలో విరవ అనే గ్రామం. అతనికి అంతవరకే తెలుసు. అతను పుట్టిన కొద్ది నెలలకే తండ్రి చనిపోవడంతో తల్లి పార్వతి పెద్ద కొడుకు రామాన్ని, రవిని తీసుకుని ఆ ఊరు వదిలేసి అన్నవరం వచ్చేసింది.

అక్కడ గుళ్లో వంట పని చేస్తూ రామాన్ని దగ్గర్లో స్కూల్లో చేర్పించింది. ఇంకో మూడేళ్లకి ఆ స్కూల్లో వాళ్లు కొత్తగా విజయవాడలో ఇంకో స్కూలు, హాస్టల్ పెట్టడంతో వాళ్లు పార్వతిని అక్కడ వంట పనికి కుదుర్చుకోవడంతో, ఆవిడ పిల్లల్ని తీసుకుని విజయవాడ చేరింది.

అక్కడే అదే స్కూల్లో ఉచితంగా చదువు చెప్పడంలో రామం, రవి ఇద్దరూ అక్కడే చదువు పూర్తి చేశారు. వాళ్లను బాగా చదివించాలన్నదే పార్వతి జీవిత ధ్యేయంగా పెట్టుకుంది.

ఎలాగైనా కొడుకులిద్దర్నీ ప్రయోజకుల్ని చేయాలన్నదే ఆమె గట్టి పట్టుదల! బయట పెళ్లిళ్లకి, శుభకార్యాలకి కూడా వెళ్లి వంటలు చేసి డబ్బు సంపాదించి పిల్లల కోసం చాలా కష్టాలు పడింది.

డబ్బు లేకపోయినా, తోడు లేకపోయినా ధైర్యంగా జీవితాన్ని ఎదురీదిన తల్లంటే రవికి చిన్నప్పట్నుంచీ అమిత ప్రేమ.

ఎలాగైనా పెద్దయ్యాక బోలెడు డబ్బు సంపాదించి తల్లిని మహారాణిలా చూసుకోవాలని రవి ఎప్పుడూ అనుకునేవాడు.

తల్లి ప్రేమ, సహనం అతన్ని పరిపూర్ణ పురుషుడిగా తీర్చిదిద్దాయి. ప్రేమను పంచుకుంటూ పోతే రెట్టింపు ప్రేమ తిరిగి మనకే చేరుతుందని తల్లి పెంపకం అతనికి నేర్పింది.

★ ★ ★

''అమ్మా! వేసవి సెలవులు కదా, అందరూ వాళ్ల ఊళ్లకి వెళ్లిపోతున్నారు, మనము మన ఊరు వెళదాం అమ్మా!'' అన్నాడు రవి.

మనసులో ఏ తుపాను లేచిందో కానీ ఒక క్షణం పాటు చిన్న బాధా వీచిక పార్వతి కళ్లల్లో ప్రతిఫలించింది. వెంటనే సంబాళించుకుంటూ ''రవి, అక్కడ మనకు ఎవరూ లేరురా! మీ బాబాయి ఉన్నారు కానీ ఇప్పుడు మనకి అక్కడ ఎవరితోనూ ఏ విధమైన సంబంధం లేదు. పోనీ అంతగా ఎక్కడికయినా వెళ్లాలనుకుంటే అన్నయ్య, నువ్వు అమరావతి చూసి రండి'' అంది.

''వద్దమ్మా! ఊరికే అడిగాను అంతే!'' అన్నాడు రవి చప్పున.

''అమ్మా! వెళ్లి రావడానికి చాలా ఖర్చు అవుతుందని'' రామం అన్నాడు.

''మీరిద్దరూ వెళతానంటే డబ్బుదేం ఉందిరా? నేనిస్తానుగా వెళ్లండి?'' అంటూ మర్నాడు ఇద్దర్నీ అమరావతికి పంపించింది.

పిల్లలకి ఎన్నడూ సంసారం గుట్టు మటుకు పైకి తెలియనిచ్చేది కాదు. వాళ్లు అడగడమే ఆలస్యం ఎంత ఫీజు కట్టాలన్నా మర్నాడు ప్రొద్దునకల్లా తీసుకువచ్చి ఇచ్చేసేది. పిల్లలకు ఏ లోటూ జరగకుండా పెంచాలన్న పట్టుదల ఉండేది ఆమెకు.

రామం ఎప్పుడూ క్లాసు ఫస్టే! అతను ఇంజనీరింగు పాసయి విజయవాడలోనే ఉద్యోగంలో చేరాడు. రవి పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి టెస్టులు రాసి హైదరాబాద్‌లో ఇన్‌కంటాక్స్ ఆఫీసర్‌గా చేరాడు.

అప్పుడు పార్వతి ఆనందాన్ని ఎవ్వరూ పట్టలేకపోయారు. చిన్న వయసులో భర్తను పోగొట్టుకుని కూడా కొడుకుల్ని అంత బాగా తీర్చిదిద్దినందుకు అందరూ ఆమెను ప్రశంసలతో ముంచెత్తారు.

మంచి సంబంధాలు రావడంతో ఏడాది తేడాలోనే రామానికి, రవికి ఇద్దరికీ పెళ్లిళ్లు జరిగాయి.

కొంత కాలం ఇద్దరు కొడుకుల మధ్య తిరుగుతున్నా, రామానికి కొడుకు పుట్టడంతో పార్వతి వాడి ఆలనాపాలనా చూడటానికి విజయవాడలోనే ఉండిపోయింది. మనవడి ముద్దు మురిపాలతో మునిగి తేలుతున్న పార్వతిని గుండెనొప్పి రూపంలో మృత్యువు కబళించింది.

అమ్మ లేదన్న కబురు విని రవి కుప్పకూలిపోయాడు. ''అమ్మా'' అంటూ దిక్కులు పిక్కటిల్లేలా ఏడ్చాడు. కానీ అతని ఆక్రందన వినిపించని లోకాలకు ఆ తల్లి తరలిపోయింది.

ఆమె ఎక్కడ పుట్టిందో, ఏ ఊరో కూడా

ఎవరికీ తెలియదు. మెట్టినిల్లు ఆమెను కలుపుకోలేదు. కానీ కృష్ణానది మటుకు ఆప్యాయంగా ఆమెను తనలో కలిపేసుకుంది.

తల్లిని సుఖపెట్టాలని, మహారాణిలా చూసుకోవాలన్న తన కల నెరవేరకుండానే ఆమె చనిపోవడంతో రవి చాలా కృంగిపోయాడు. ''అమ్మా నన్ను వదిలేసి ఎందుకు వెళ్లిపోయావు? కేవలం మమ్మల్ని పెంచి పెద్ద చేయడానికే ఈ లోకంలో ఉండామనుకున్నావా? నీ అవసరం మాకు లేదనుకున్నావా అమ్మా! అమ్మా, నిన్ను వదలి ఉండలేను!'' చాలా రోజులు తల్లిని తలుచుకుంటూ కుళ్లికుళ్లి ఏడ్చాడు రవి!

ఆమె లేదన్న వాస్తవాన్ని జీర్ణించుకోవడానికి అతనికి ఎన్నో సంవత్సరాలు పట్టింది. ఇప్పటికీ సుఖానికి, కష్టానికి ఏ స్థితిలోనయినా ముందు అతనికి చప్పున అమ్మే గుర్తుకు వస్తుంది.

★ ★ ★

సుజాత నెమ్మదిగా కోలుకుంటోంది. రోజులు గడిచే కొద్దీ ఇద్దరి మధ్య తెలియని వెలితి పేరుకుంటోంది.

''ఏవండీ!'' సుజాత పిలుపుకి మంచం మీద పడుకున్న రవి లేచి కూర్చున్నాడు.

''మనకి పిల్లలు పుట్టరన్న విషయం తేలిపోయింది. పిల్లలు లేని ఇల్లు ఒక ఇల్లా అనిపిస్తోంది!''

''ఎందుకు సుజా! ఊరికే అదే ఆలోచిస్తావు?'' విసుగ్గా అన్నాడతను.

''అదిగో ఆ విసుగే వద్దంటున్నాను! పిల్లలు అనేటప్పటికీ మీరు మీ ముఖం అదోలా పెట్టేసుకుంటారు!'' కళ్లల్లో నీరు అదిమి పెట్టుకుంటూ అంది సుజాత!


''సుజా! మన చేతుల్లో లేని దాని గురించి బాధపడటం ఎందుకు చెప్పు? ఇంకాసేపు మనం ఇదే విషయం మీద కంటిన్యూ అయితే నువ్వు ఏడుస్తావు అది నేను చూడలేను. మళ్లీ ఇద్దరికీ బాధే! ఎందుకు చెప్పు?''

''అందుకే నేను ఒక నిర్ణయానికి వచ్చాను'' నెమ్మదిగా అంది సుజాత.

ఆశ్చర్యంగా చూశాడతను ఆమె వంక!

''ఏవండి మనం అనాథ శరణాలయం నుంచి ఎవర్నయినా దత్తత తీసుకుందాం! అలా ఏ కులమో తెలియని పిల్లలు మనకు వద్దనుకుంటే మనకు తెలిసిన వాళ్ల పిల్లల్ని తెచ్చుకుని పెంచుకుందాం!''

వినకూడని మాటల్ని విన్నట్టు చూశాడు రవి ఆమె వంక! వస్తున్న కోపాన్ని అదిమిపెట్టుకుంటూ...



''సుజా! ఇదే ఆఖరిసారి చెబుతున్నాను. ఇంకెప్పుడూ ఇలాంటి ప్రస్తావన నా ముందు తేవద్దు. ఎవరికో పుట్టిన పిల్లల్ని నాదిగా భావించుకోవడం అన్నది కలలో కూడా నేను ఊహించలేను. నువ్వు కూడా ఇదే గుర్తుపెట్టుకోవడం ఇద్దరికీ మంచిది. నిజానికి అలా పిల్లల్ని తెచ్చి పెంచుకున్నా పెద్దయ్యాక వాళ్ల పబ్బం గడుపుకుని చక్కాపోతారు. అంతేకానీ నీవైపు నావైపు కనీసం వెనక్కి తిరిగి కూడా చూడరు. మళ్లీ ఏడుస్తూ మనిద్దరమే మిగులుతాం? ఇంకెందుకు చెప్పు? ఆ ప్రయత్నం మనం ఇప్పట్నుంచే చేసి మన కోసమే మనము బతుకుదాం!'' అన్నాడు.

''అది కాదండీ!'' సుజాత చెప్పబోయింది. ఆమెని కట్ చేస్తూ...

''సుజా! ఇంక ఆ టాపిక్ ఎత్తకు? నేను నీకేం లోటు చేయలేదు. నిన్ను ప్రాణంగా చూసుకుంటున్నాను. పిల్లల్ని దత్తత తీసుకునే విషయంలో మటుకు నా నిర్ణయంలో మార్పు ఉండదు'' అన్నాడతను!

ఆ తర్వాత ఎన్నిసార్లు నచ్చచెప్పటానికి ప్రయత్నం చేసినా అతని మొండి పట్టుదలకు సుజాత తలవంచక తప్పలేదు. కానీ ఆమె మనస్సులో తనకు పిల్లలు లేరన్న వెలితి రోజురోజుకూ పెరిగిపోసాగింది. అది వాళ్లిద్దరి మధ్య తెలియని అగాధం పెంచింది.

★ ★ ★

''సుజాత లేదండి, మార్కెట్టుకు వెళ్లింది'' తాళాలిస్తూ చెప్పింది రవికి ఇంటావిడ!

తాళాలు తీసుకుని మేడ మీదకు వెళ్తుంటే, ''రవీ సుజాత లేదుగా, రండి కాఫీ తాగి వెళ్లండి!'' ఇంటాయన వరండాలో ఎవరితోనో మాట్లాడుతూ అతన్ని ఆహ్వానించాడు.

ఆవిడ అందరికీ కాఫీలు తెచ్చి ఇచ్చింది.

''వీళ్లు మాకు దూరపు బంధువులు స్టేట్స్‌లో ఉంటారు, మమ్మల్ని చూడటానికి వచ్చారు'' అంటూ ఎదురుగా ఉన్న దంపతుల్ని పరిచయం చేశాడాయన!

''ఏం చేస్తున్నావు బాబు?'' అడిగారాయన.

''ఇన్‌కంటాక్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నా నండి''

''అలాగా చాలా సంతోషం. మీ నాన్నగారు ఏం చేస్తారు?'' అని అడిగారు ఆయన.

''మా నాన్నగారు మా చిన్నతనంలోనే పోయారండి, మా అమ్మగారు పోయి రెండేళ్లు దాటుతోంది''

''ఏ ఊరు మీది?''

''మేం పెరిగింది అంతా విజయవాడలోనే నండి! మా అమ్మగారిది మటుకు 'విరవ' అనే గ్రామం! నిజానికి అది ఎక్కడుందో కూడా నాకు తెలియదు'' నవ్వుతూ అన్నాడు రవి!

''విరవా! మా అమ్మగారిది అదే ఊరు? మీ అమ్మ పేరేమిటి బాబు?'' ఆవిడ చటుక్కున ముందుకు వంగి ఆసక్తిగా అడిగింది.

''పార్వతి'' అన్నాడు.

''మీ నాన్న పేరు రాజారావు కదూ''

''అవునండి!''

''అరే, నువ్వు మా పార్వతి కొడుకువా, పెద్దాడివా?'' సంతోషపడిపోతూ అడిగింది.

''చిన్నవాడినేనండి?''

ఆవిడ ఇంతెత్తున ఆశ్చర్యపడింది.

''అబ్బా ఎంత పెద్దవాడివయ్యావు? మీ అమ్మ ఊరు వదిలేటప్పటికి నెలల పిల్లాడివి! మీ బాబాయి పోరు పడలేక రాత్రికి రాత్రే కట్టుబట్ట లతో మీ అమ్మ ఇల్లు వదిలేసింది. అదే నేను ఆఖర్న చూడటం. నిజంగా ఎంత అభిమాన వతో!''

ఆవిడ మాటలకు తల్లి తమను పెంచడం కోసం పడ్డ బాధలన్నీ అతని కళ్లముందు గిర్రున తిరిగాయి!

'పాపం అమ్మకి జీవితమంతా ఎప్పుడూ కష్టాలే?' అనుకున్నాడు.

''మాకా విషయాలేవీ తెలియవండీ, మేము ఎప్పుడూ ఆ ఊరే వెళ్లలేదు, మా అమ్మ మాకేం చెప్పలేదు'' అన్నాడు రవి.

''అయ్యో నీకు తెలియదా! మీరు పెద్ద ఆస్తి పరులు బాబు, మీ నాన్న రాజారావు ముందు లక్ష్మిని చేసుకున్నాడు. నిన్ను కనగానే మీ అమ్మ పురిట్లోనే చనిపోయింది. పిల్లల్ని సాకడానికి అవ సరం అని, పేదింటి పిల్ల అని, ముందు వెనకా ఎవరూ లేరని, కిమ్మనకుండా పడి ఉంటుందని అందరూ నచ్చచెపితే మీ అమ్మను మీ నాన్న రెండో పెళ్లి చేసుకున్నాడు. కానీ పెళ్లయిన నెలకే పాము కరచి మీ నాన్న పోయాడు. మీ బాబాయి ఆస్తి పంచవలసి వస్తుందని, నష్ట జాతకురాలు అంటూ మీ అమ్మను ఇంట్లోంచి గెంటేశాడు.''

ఆవిడ మాటలకి రవికి తల గిర్రున తిరిగిన ట్టయింది.

''మీరు చెప్పేది నిజమేనా? మా అమ్మ మాకు సవతి తల్లా!'' గొంతు తడారిపోతుం డగా అన్నాడు.

''అవును, అందుకే మీ బాబాయి నువ్వు రెండో భార్యవి, నీకు చిల్లిగవ్వ రాదు అంటూ ఇంట్లోంచి పొమ్మన్నాడు. కనీసం పిల్లలకయినా ఇవ్వండి అని ఎంత అడిగినా కూడా 'ఏం నీ కడుపున పుట్టిన పిల్లలా వాళ్లు? లేక వాళ్ల పేరు చెప్పి ఆ డబ్బంతా నువ్వే వాడుకుందామనా!' అంటూ మీ అమ్మని చీదరించుకున్నాడు. 'అంతే! నా పిల్లలు నాకేం బరువుగాదు, వాళ్లని రాజాలా పెంచుతా, మీ ఇల్లు వద్దు, మీ డబ్బు వద్దు' అంటూ మీ అమ్మ మీ బాబాయి మీద సవాలు చేసి మరీ ఇంట్లోంచి పోయింది. అప్పుడు నీకు పుట్టెడు జ్వరం వేలాడిపోతు న్నావు. అలాగే నిన్ను భుజానికేసుకుని, మీ అన్నయ్యని తీసుకుని వెళ్లిపోయింది. సవతి తల్ల యినా మీ అమ్మ మిమ్మల్ని చదివించి ఇంత ప్రయోజకుల్ని చేసిందంటే ఎంతో గొప్ప విషయం! నిజంగా పార్వతి చాలా ఉత్తము రాలు!'' ఆవిడ సంబరపడిపోతూ అంది.

రవికి మెదడు అంతా మొద్దుబారిపోయింది. అతికష్టం మీద, ''మీరు చెప్పేది నేను నమ్మలేక పోతున్నాను'' అన్నాడు దిగ్భ్రాంతిగా.

ఆవిడ ఇంకా ఏదో చెప్పబోయింది. ఇంతలో సుజాత రావడంతో రవి లేచి ప్రాణం లేనివాడిలా ఇంట్లోకి నడుచుకుంటూ వెళ్లిపో యాడు. రాత్రంతా అతను నిద్రపోలేదు. తనని ఇంత ప్రేమగా పెంచిన తల్లి తనకు సవతి తల్లి అన్న నిజాన్ని అతను జీర్ణం చేసుకోలేకపో యాడు.

తన తల్లి గురించి, తమ గురించి ఆ ఊరెళ్లి నిజనిజాలు తేల్చుకుందామని నిశ్చయించుకుని సుజాతకి విషయం క్లుప్తంగా చెప్పి మర్నాడే బయలుదేరాడు. ఊరు చేరగానే ఇల్లు త్వరగానే తెలిసింది. చాలా పెద్ద ఇల్లు. ఆశ్చర్యపోతూ లోపలికి వెళ్లాడు.

బాబాయి వాళ్లు, వాళ్ల కొడుకులు, కోడళ్లు అంతా కలిసే ఉంటున్నారు. రవి తనను పరి చయం చేసుకోగానే వాళ్లంతా సంతోషించకపోగా చాలా కంగారుపడిపోయారు. ఆస్తిలో వాటా ఇవ్వవలసి వస్తుందని ముక్తసరిగా మాట్లాడారు. గుక్కెడు మంచినీళ్లు ఇవ్వలేదు. కానీ బోలెడు అప్పుల్ని చూపించారు!

'ఆవిడ చెప్పిందంతా అక్షరాలా నిజం! అయినవాళ్లందరూ పక్కకి తోసేసినా ప్రేమతో అక్కున చేర్చుకుని ఆ మహాతల్లి నాకు జీవితాన్ని చ్చింది!' తల్లిని తలుచుకుంటేనే రవికి కళ్లలో నీళ్లు తిరిగాయి.

మీకు ఆస్తేం రాదు. అంతా నాదేనంటూ బాబాయి చాలా రూల్సు చెప్పాడు! తన సొంత అన్న కొడుకని తెలిసి కూడా ఆయన రక్తసంబం ధాన్ని గుర్తించలేనట్టు నటించాడు! రవికి చాలా అసహ్యం వేసింది.

ఇక ఒక క్షణం కూడా అక్కడ ఉండలేక వెంటనే తిరుగుప్రయాణమయ్యాడు. దారిలో బస్సులో వస్తుంటే తల్లి రూపం అతని కళ్ల ముందు కదలాడింది. ఆమెతో ఆడిన దొంగా టలు, తిన్న గోరుముద్దలు అన్నీ గుర్తుకు రాగా మనస్సంతా భారమైపోయింది. దుఃఖాన్ని ఆపు కోలేక భోరుమని ఏడ్చేశాడు.

★ ★ ★

''సుజాతా! మా అమ్మ కాళ్ల పారాణి కూడా ఆరకముందే భర్తను పోగొట్టుకుని రెండేళ్ల కొడుకుని, నెలల పసికందును గుండెకు హత్తు కుని ఇంట్లోంచి బయటికి వచ్చింది. భర్తతో అనుబంధమే లేదు. పిల్లలతో అస్సలు బంధమే లేదు. అయినా వాళ్లను అక్కున చేర్చుకుంది. రక్తసంబంధం ఉన్న బాబాయి ఛీకొట్టినా ఇంకో తల్లి కన్న రెండు పసి ప్రాణాలను తన ప్రాణంగా చేసుకుంది. సవతి తల్లి అని తెలియకుండా మమ్మల్ని పువ్వుల్లో పెట్టి పెంచింది. చేతిలో కాణీ లేకుండా జనారణ్యంలోకి వచ్చి తన పిల్లల కోసం నానా పాట్లు పడింది. పిల్లల్ని ప్రయోజ కుల్ని చేసి అదే తన గెలుపుగా భావించింది. నన్నింత వాడిని చేసిన ఆ తల్లి రుణం ఎలా తీర్చుకోగలను చెప్పు సుజా!''

కళ్లలో నీళ్లు తుడుచుకుంటూ అన్నాడు రవి.

''బాధపడకండి! నిజంగా మీ అమ్మగారు దేవతే'' అంది సుజాత ఓదార్పుగా.

''సుజా, నువ్వెన్ని సార్లు చెప్పినా పరాయి పిల్లలు మన పిల్లలు అవుతారా అని మూర్ఖంగా ఆలోచించాను. కానీ నా తప్పును నేను తెలుసు కున్నాను. పిల్లల్ని మనం ఎంత ప్రేమగా పెంచితే అలాగే పెరుగుతారన్న నిజం ఇప్పటికి నాకు అర్థ మైంది! మనం రేపే అనాథ శరణాలయానికి వెళ్లి పాపని తెచ్చుకుని మన బిడ్డగా పెంచు కుందాం!''

రవి మాటలకు సుజాత కళ్లు ఆనందంతో మెరిశాయి.

''ఏవండీ! నిజంగానా!'' సంతోషంలో అతన్ని రెండు చేతులు పట్టుకుని ఊపేసింది.

''అవును సుజా! పాపకి అమ్మ పేరే పెడదాం!'' తల్లిరూపం కళ్ల ముందు నిండుగా కదలాడుతుండగా అన్నాడు రవి!

''తప్పకుండా!'' సంతృప్తిగా అంది సుజాత!

☆